సమాచారం

దుర్గం చెరువు లేక్ .. ప్రవేశం ఫీజు వ్యక్తికి రూ.10
- పిల్లలకు రూ.5
- నెలసరి వాకర్స్ పాస్ రూ.200
- సంవత్సర వాకర్స్ పాస్ రూ. 2000
- సీనియర్ సిటిజన్స్ వాకర్స్ పాస్ రూ. 800
- స్టిల్ కెమెరా ఫొటోషూట్ రూ. 250, (ఫర్ డే)
- వీడియో కెమెరా షూటింగ్ రూ.5000 (ఫర్‌డే)
- ఫిల్మ్‌షూటింగ్ రూ. 25000 (ఫర్‌డే)
- ఇంద్రధనుస్సు రంగులతో మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్.
- రోజుకు నాలుగు షోలు: రాత్రి 7గంటల నుంచి 10 గంటల మధ్యలో
- 7 పాటలకు అనుగుణంగా దాదాపు 30 నిమిషాల పాటు ఒక షో.
- 20 మీటర్ల ఎత్తు , 60 మీటర్ల పొడవుతో రంగురంగుల డిజైన్‌లతో ఫౌంటేన్
- సీనియర్ సిటిజన్‌లు, సందర్శకులు కూర్చుని చూసే విధంగా ఏర్పాట్లు.
- వాకింగ్‌కు 4.2 కిలోమీటర్ ట్రాక్.

ప్రజావాణి..5 ఫిర్యాదులు



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 5 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 4, ఇంజనీరింగ్ విభాగానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీ ప్రేమ్‌కుమార్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్-బెంగుళూర్ మారతహళ్లికి ఏసీ బస్సులు

మియాపూర్: మియాపూర్ డిపో పరిధిలోని మియాపూర్ ఎక్స్‌రోడ్డు నుండి బెంగుళూర్ (మారతహళ్లి)కి లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులు అందుబాటులో ఉన్నాయని డిపో-1 మేనేజర్ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6.20 గంటలకు మియాపూర్ ఎక్స్‌రోడ్డు నుండి బయల్దేరి నిజాంపేట్ ఎక్స్ రోడ్డు, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, మెహిదీపట్నం, ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు శంషాబాద్ మీదుగా బెంగుళూరు వెళ్తుందని తెలిపారు. అదేవిధంగా బెంగుళూర్ మారతహళ్లి నుంచి ప్రతిరోజు రాత్రి 8.30 గంటలకు బయల్దేరుతుందని చెప్పారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేసిన కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్య

ఆల్విన్‌కాలనీ: హోప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేదలకు బియ్యం, సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేస్తున్న హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షౌకత్ ఆలీ మున్నా, వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 30 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ.1500 జరిమానా, 22 మందికి రూ. వెయ్యి చొప్పున, మరో ఆరుగురికి రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

'హైడ్రా' కూల్చివేతలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, భాగ్యనగర్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గోడను హైడ్రా అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య సోమవారం కూల్చివేశారు. భాగ్యనగర్‌కాలనీలోని ఓ ఇంటి ఎదుట ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి షెడ్డు ఏర్పాటు చేశాడు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఎన్నో ఏళ్లుగా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై వారు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మియాపూర్ మదీనాగూడ జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనదారులు

అడ్డదారి.. ఆగమాగం

రాంగ్‌రూట్‌లపై అవగాహన కల్పిస్తున్నా మారని వాహనదారుల తీరు ● ఓవైపు ప్రమాదాలు.. మరోవైపు ట్రాఫిక్‌జామ్

మియాపూర్: మియాపూర్ మదీనాగూడ జాతీయ రహదారిపై వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోలేక దూరం తగ్గుతుందని కొందరు వాహనదారులు అడ్డదారులను ఎంచుకుని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. రాంగ్‌రూట్‌లో వచ్చేవారితో బాటు ఆ రూట్‌లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. అడ్డదారి ప్రయాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రాంగ్‌రూట్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి అడ్డదారిలో వెళ్లే వారిపై ఎఫ్ఐఆర్, కేసులు నమోదు చేసి అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు. జాతీయ రహదారి పక్కన ఉన్న కాలనీల నుండి వచ్చే వాహనదారులు యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో వెళ్తూనే ఉన్నారు. మియాపూర్, మదీనాగూడ, బొల్లారం రోడ్లలో ఉన్న యూటర్న్‌ల వద్ద ద్విచక్రవాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా ఇదే బాట పట్టాయి.

రాంగ్‌రూట్ పాయింట్లు ఇవి..

చందానగర్ గంగారం వద్ద జాతీయ రహదారిపై యూటర్న్, దీప్తీశ్రీనగర్ కాలనీ వద్ద యూటర్న్, అదేవిధంగా మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ ముందు మియాపూర్‌లోని సంతోష్ దాబా ముందు బొల్లారం రోడ్డులోని జేపీఎన్‌నగర్ రోడ్డు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద యూటర్న్, అదేవిధంగా బీకే ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న యూటర్న్ వద్ద ఎక్కువగా వాహనదారులు అడ్డదారిలో వెళ్తూ రోడ్డు దాటే ప్రయత్నం చేస్తున్నారు. దీప్తీశ్రీనగర్ కాలనీ నుండి ఎక్కువగా ద్విచక్ర వాహనదారులతో పాటు చెత్త ఆటో రిక్షాలు, వాటర్ ట్యాంకర్లు, భారీ వాహనాలు అడ్డదారిలో వెళ్తున్నాయి. దీంతో అక్కడ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.



స్పెషల్ డ్రైవ్‌లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

- ట్రాఫిక్ పోలీసులు అడ్డదారిలో వెళ్లే వాహనదారులను కట్టడిచేసేందుకు గత సంవత్సరం స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టారు. రాంగ్‌రూట్‌లో వచ్చే 99 మంది వాహనదారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు..

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాము. వాహనదారులు దూరం తగ్గుతుందనే ఆలోచనతో ఇలా వస్తే వచ్చేవారికి ప్రమాదం జరిగే అవకాశముంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలనీల నుండి వచ్చే వాహనదారులు యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో రాకూడదు. ఈ దారిలో నేరుగా వచ్చే వారికి ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంది. అడ్డదారిలో ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము.

– మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్

పోస్టాఫీస్‌ను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలి



డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆఫీసర్ ఆర్ముగంకు వినతిపత్రం అందజేస్తున్న బుచ్చిరెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: చందానగర్‌లోని పోస్టాఫీస్‌ను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఆఫీసర్ బి.ఆర్ముగంకు టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు పోరెడ్డి బుచ్చిరెడ్డి కోరారు. పోస్టాఫీస్ మొదటి అంతస్తులో ఉండటం వలన ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనచారిలు వేర్వేరుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించామని, ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.60లక్షల సొంత నిధులను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ రాములు గౌడ్,పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

బీజేపీ ఆధ్వర్యంలో 'తిరంగా ర్యాలీ'



రాయదుర్గం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్ ఆధ్వర్యంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాయదుర్గంలో ప్రారంభమైన ర్యాలీ మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, నల్లగండ్ల, గుల్‌మొహర్‌పార్కు రోడ్డు మీదుగా ట్రిపుల్‌ఐటీ కూడలి, గచ్చిబౌలి కూడలి మీదుగా టెలికామ్‌నగర్ వరకు సాగింది. పెద్ద సంఖ్యలో బీజేపీ, బీజేవైఎం ,మహిళామోర్చా, ఇతర అనుబంధ సంఘాల జిల్లా, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆవులను అమ్మితే చర్యలు

నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి



పశువ్యాపారుల సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్, ఇన్‌స్పెక్టర్

మణికొండ: బక్రీద్ పండగను పురస్కరించుకుని పశువ్యాపారులు ఆవులను అమ్మవద్దని నార్సింగి పోలీసు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కె. వేణుగౌడ్ సూచించారు. సోమవారం నార్సింగి మార్కెట్ కమిటీ కార్యాలయంతో వారు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చట్ట ప్రకారం ఆవులను అమ్మటం, వాటిని కోయటం లాంటివి చేయవద్దన్నారు. నార్సింగిలో కొనసాగే పశు సంతలో వాటిని విక్రయించవద్దన్నారు. ఇక్కడ నుంచి తీసుకుని వెళ్లే క్రమంలో ఆవులు ఎక్కడైనా లభిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

గచ్చిబౌలి: విడాకులు తీసుకున్న ఓ యువకుడు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సక్రూ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కొకుంట్ల మండలం, అప్పంపల్లికి చెందిన విజయ్ చైతన్య(31) రాయదుర్గంలోని పోచమ్మబస్తీలో రెడ్డి సేన మెన్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేసే చైతన్య ఆదివారం రాత్రి 9.30 గంటలకు తల్లి లక్ష్మీకళకు ఫోన్ చేసి మాట్లాడాడు. తర్వాత హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్వాహకుడు రంజిత్‌రెడ్డి పోలీసులకు సమాచారం అందించాడు. 10 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్న విజయ్ చైతన్యకు ఓ కూతురు. భార్యతో మనస్పర్థలు ఏర్పడటంతో గత సంవత్సరం విడాకులు తీసుకున్నాడు. కొన్నేళ్లుగా భార్యతో పడ్డ బాధలను డైరీలో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డైరీలోని కొన్ని పేజీలను గోడలకు అంటించినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి వెంకట్ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



విజయ్ చైతన్య (ఫైల్)

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



బ్యాంక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, సిబ్బంది

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎస్‌బి బ్యాంక్‌ను సోమవారం ఎమ్మెల్యే గాంధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సరైన సేవలు అందించాలన్నారు. కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, బ్యాంక్ ప్రతినిధులు, నాయకులు సంజీవరెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

తొలగించిన వ్యర్థాలు మళ్లీ కాల్వల్లోకి..

ఫిలింనగర్: వర్షాకాలం నాటికి వరద నీటి కాల్వల్లో, నాలాల్లో చేయాల్సిన డీసిల్టింగ్ పనులు ఈ పాటికే పూర్తి కావాల్సి ఉంది. కానీ జూబ్లీహిల్స్ డివిజన్‌లో పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరో వైపు వరద నీటి కాల్వల్లో నుంచి తొలగించిన వ్యర్థాలను అక్కడి నుంచి తరలించకుండా రోజుల తరబడి అలాగే వదిలేస్తుండటంతో వర్షాలకు ఆ వ్యర్థాలు మొత్తం మళ్లీ కాల్వల్లోకి వెళ్తున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్- 71లో నవ నిర్మాణ్‌నగర్ కాలనీలో వరద నీటి కాల్వల నుంచి తొలగించిన వ్యర్థాలు అక్కడే కుప్పలుగా పోశారు. వీటిని తొలగించాలని పలుమార్లు సిబ్బందికి సూచించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా నాలా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పటేల్‌నగర్ నుంచి బీజేఆర్‌నగర్ వైపు వెళ్లే దారిలోని మలుపు వద్ద ఉన్న నాలా ప్రమాదకరంగా ఉంది. ఈ నాలాకు రక్షణగా ఉన్న గ్రిల్ విరిగిపోయి నాలాలో పడిపోయింది. దీంతో ఈ దారిగుండా రాకపోకలు సాగించే వాహనదారులు రాత్రి వేళ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్య గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలను గౌరవించినపుడే ఎదుగుదల



విద్యార్థులను అభినందించిన చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి

రాయదుర్గం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను సైయింట్ సంస్థ సోమవారం అభినందించింది. నానక్‌రాంగూడలోని సైయింట్ సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించాలన్నారు. కాగా సైయింట్ సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో దత్తత తీసుకొన్న 33 ప్రభుత్వ పాఠశాలల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను పిలిపించి అభినందించారు. ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులు , పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అవసరాలను తీర్చడంలో సైయింట్ ముఖ్య భూమిక పోషించింది.

21న జాబ్ మేళా

మోతీనగర్: నిరుద్యోగ యువతకు నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మేనేజర్లు రాజశేఖర్, సంపత్‌కుమార్, ఐక్రియేట్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రావణిలు ఓ ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు కూకట్‌పల్లి, మెట్రో పిల్లర్ నంబర్ ఏ 827, ఐక్రియేట్ కాలేజీలో జాబ్ మేళా జరగనున్నట్లు తెలిపారు. జావా, వెబ్ డిజైనింగ్ డెవలప్‌మెంట్, కాడ్ ఇంజనీరింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్స్, బ్యాంకింగ్, ఫార్మసీ, బీపీఓ ఉద్యోగాలకు సంబంధించిన కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154084728, 9963172858 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వికసించిన మే పుష్పం



రాయదుర్గం: గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో మే పుష్పం వికసించింది. 86బి క్వార్టర్స్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ స్టేజ్ మేనేజర్ సాయిబాబానాయుడు ఇంట్లో ఈ పువ్వు పూసింది. మూడేళ్ళ క్రితం మొక్క నాటగా అది ఈ ఏడాది పూసిందని సాయిబాబానాయుడు తెలిపారు.

చెత్తకుప్పలు.. దుర్వాసన

మియాపూర్: మియాపూర్‌లో కాలనీ, బస్తీలలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మియాపూర్ స్టాలిన్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రతిరోజు తొలగించాల్సిన చెత్తను తొలగించకపోవడంతో కుప్పలు కుప్పలుగా పేరుకుపోతుంది. ఇటీవల అడపాదడపా వర్షాలు పడుతుండడంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మియాపూర్ స్టాలిన్‌నగర్ కాలనీలో రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు

కలగానే మినీ రైతుబజార్

- తాజా కూరగాయలు దొరక్క ఇబ్బందులు
- అధిక ధరలకు విక్రయిస్తున్న స్థానిక వ్యాపారులు
- తప్పనిసరిగా మెహిదీపట్నం వెళ్లాల్సిందే..
- మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజానీకం

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ పరిసరాల్లో మినీ రైతుబజార్ ఏర్పాటు స్థానికులకు కలగానే మిగిలిపోతున్నది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ఎక్కడైనా మినీ రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు చేసుకున్న విన్నపాలు బూడిదలో పోసిన పన్నీటి చందాన తయారవుతున్నాయి. గడచిన ఐదేళ్లుగా స్థానికంగా కొత్తగా చాలా కాలనీలే ఏర్పడ్డాయి. ఎక్కువగా అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. వీరందరితోపాటు పరిసర ప్రాంతాలవారికి ప్రస్తుతం మెహిదీపట్నం రైతుబజారే దిక్కు. స్థానికంగా తాజా కూరగాయలు దొరక్క ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక వ్యాపారులు కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తుండటంతో చాలామంది కొనలేని పరిస్థితి.

- అత్తాపూర్ డివిజన్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయ పరిసర ప్రాంతాలలో విశాలమైన ప్రభుత్వ స్థలం ఉంది. ఆ స్థలంలో మినీ రైతుబజార్ ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలుప్రాంతాలలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వారాంతపు సంతలు నడుస్తున్నాయి. వాటిలోనూ కూరగాయల ధరలు ఎక్కువగానే ఉండటం, తాజాగా లేకపోవడంతో ప్రజలు కొనేందుకు ఆసక్తి చూపడం లేదు.



- తాజా కూరగాయల కోసం శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలోని 30 కాలనీల వారితో పాటు బుద్వేల్, రాజేంద్రనగర్ పరిసరాలో ఉన్న 30 కాలనీల ప్రజతో పాటు ఈ ప్రాంతాలలో ఉన్న మెస్‌లు, హోటళ్లు నిర్వహించే వారు మెహిదీపట్నం రైతుబజార్‌కు రావాల్సి వస్తోంది. ఇది దూరాభారమని వారు వాపోతున్నారు. హైదర్‌గూడ లాంటి కొన్ని ప్రాంతాలలో మాత్రమే సంతలకు గిరాకీ ఉంటుంది. ఈ నేపథ్యంలో మినీ రైతుబజార్ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండటమే కాకుండా దూరం తగ్గడంతో బాటు తక్కువ ధరలకే తాజా కూరగాయలు లభిస్తాయనడం నిర్వివాదాంశం.